క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఆలయకమిటీ



బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులు

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ నూతన పాలకమండలి ఆదివారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టింది. ఆలయ కమిటీ అధ్యక్షురాలిగా గుర్రం ప్రమీలతో పాటు పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రంగా వెంకటేశ్వర్లు, గొండేల ముత్తయ్య, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, కళ్యాణపు పుల్లారావు, గుర్రాల నాగిరెడ్డి, కరివేద వెంకటేశ్వరరావు, కటకం నరసింహారావు, బాలు నాయక్, చీదిరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

వైరా: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరిగిన లక్కిశెట్టి వాసుకు వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.14 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. లయన్ పుతుంబాక ఇంద్రాణి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వైరాలోని వాసవీ కల్యాణ మండపంలో ఆర్థికసాయం అందజేశారు. పెనుగొండ ఉపేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వీడీజీ -2 నంబూరి మధు, పీడీజీ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జీఎంటీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉంగ్రు శ్యాంబాబు, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, చింతనిప్పు వెంకటయ్య, వెంకటేశ్వరరావు, రాంబాబు, నాగేశ్వరరావు, హనుమాయమ్మ, విజయరాణి, వెంకటేష్ పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరం

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సిటీ నర్సింగ్ హోమ్ సహకారంతో ఆదివారం మండలకేంద్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బాలభారతి విద్యాలయంలో కేఎస్ఎం విద్యాసంస్థల చైర్మన్ కోటగిరి ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డీఎస్ఎల్ ఆనంద్ ఆధ్వర్యంలో వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, నంబూరి కనకదుర్గాప్రసాద్, బెల్లంకొండ ఆంజనేయులు, దారా శ్రీనువాసరావు, మిట్టపల్లి నరసింహరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, కటికి వెంకటేశ్వర్లు, లాయర్ బ్రహ్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, కేతేపల్లి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఆబోతు మృతి



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

చింతకాని: మండలపరిధిలోని నాగులవంచ గ్రామంలో అనారోగ్యంతో ఆబోతు ఆదివారం మృతి చెందింది. మృతి చెందిన ఆంబోతుకు పూజలు చేసి ఊరేగింపుతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆలస్యం నాగమణి, ఉపసర్పంచ్ యరదేశి వినోద, ఎంపీటీసీ మునుకుంట్ల నాగరత్నం, కంభం సరోజిని, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఏన్కూరు: సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా వైరాలో నిర్వహించే భారీ మోటర్ సైకిల్ ర్యాలీ, రక్తదాన కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని మండలాధ్యక్షుడు బాణోత్ సురేష్ ఆదివారం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, పోట్ల శ్రీను, మేడా ధర్మారావు, భూక్యా చందూలాల్, లాలూనాయక్, భూక్యా శివ, కాంతి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ జీఓ విడుదలపై హర్షం

పెనుబల్లి : దివ్యాంగులకు ప్రభుత్వం రూ.4,016లకు పెంచి పింఛన్ అమలు చేస్తూ జీఓ విడుదల చేయడంపై దివ్యాంగులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జీఓ విడుదలపై దివ్యాంగులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నోటీసు రగడ..

సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్‌లతో శిథిలావస్థకు ఇళ్లు

- శ్లాబ్ పెచ్చులూడి, గోడల పగుళ్లతో కూలేందుకు సిద్ధంగా..
- వారంలో ఇళ్లు ఖాళీ చేయాలని మున్సిపాల్టీ నోటీసులు
- ఎక్కడికెళ్లి తలదాచుకోవాలంటూ కాలనీ వాసుల ఆందోళన
- శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు..



ఎన్టీఆర్ నగర్‌లో పూర్తిగా పెచ్చులూడి చువ్వలు బయటపడిన శ్లాబ్

సత్తుపల్లి: పెచ్చులూడిన శ్లాబ్.. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు.. ఆపై జోరున కురుస్తున్న వర్షాలతో మున్సిపల్ శాఖ అప్రమత్తమై నోటీసులు జారీ చేయటంతో రగడ జరుగుతోంది. సత్తుపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఎన్టీఆర్, వెంగళరావు, జలగంనగర్‌లలో పదుల సంఖ్యలో ఇళ్లు సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ ప్రభావంతో శ్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరి.. గోడలు పగుళ్లతో నెర్రబారి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అసలే వర్షాకాలం కావటంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు శ్లాబ్‌లు నానిపోయి ప్రమాదకరంగా మారాయి. పెచ్చులూడి ఇళ్లల్లో నివసిస్తున్న వారిపై పడి క్షతగాత్రులైన సంఘటనలు ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయో అని కాలనీ వాసులు దినదినగండంగా మారింది.

వారం రోజుల్లో ఖాళీ చేయాలని..

వర్షాకాలం దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మున్సిపల్ శాఖ పట్టణంలోని శిథిలావస్థకు చేరిన నివాసాలకు నోటీసులు జారీ చేస్తుంది. ఈ క్రమంలో ఎన్టీఆర్‌నగర్‌లోని పఠాన్ వహీదా, రాయిన లక్ష్మి, భూషణం, కొప్పుల వెంకటేశ్వరరావు, సర్దార్ బేగ్‌లకు వారం రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయటం వివాదానికి దారి తీసింది. ఇళ్లల్లో నుంచి కుటుంబ సభ్యులతో సహా బంధువుల ఇళ్లకు వెళ్లాలని సూచించారు.

బాధితుల ఆందోళన..

ఎంతోకాలంగా కాలనీలోని ఇళ్లల్లో ఉండలేమని పలుమార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని.. ఇప్పుడు ఉన్న ఫలంగా ఇళ్లు ఖాళీ చేయాలనటం ఎంత వరకు సబబు అంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నగర్‌లలో సుమారు 200లకు పైగా ఇళ్లు సింగరేణి బాంబ్‌బ్లాస్టింగ్‌లతో దెబ్బతిన్నాయని.. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఇళ్లు వదిలి వెళ్లామనడం దారుణమని వాపోయారు. పగలంతా కూలీ పనులు చేసుకుంటూ బతుకీడుస్తున్నామని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సింగరేణి సంస్థతో ఇళ్లకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు ఇళ్లు ఖాళీ చేయమని.. అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. అద్దెలకు నివాసం ఉండే స్థోమత ఉంటే ఎందుకు ఇలాంటి ఇళ్లల్లో ఉంటామని వాపోయారు.



పెచ్చులూడిన శ్లాబ్‌ను చూపిస్తున్న బాధిత మహిళ

శాశ్వత పరిష్కారం చూపండి..



ఇళ్లు పెచ్చులూడిపడి దెబ్బలు కూడా తగిలాయి. అయినా ఎవరూ పట్టించుకోవటం లేదు. శ్లాబ్ అంతా పెచ్చులూడి కురుస్తోంది. చేసేదేమీలేక ఇంట్లోనే ఉండాల్సి వస్తోంది. మా కుటుంబంలో ఉన్న ఆరుగురు బయట ఎక్కడికెళ్లి ఉండాలి. అద్దెలు చెల్లించే స్థోమతే ఉంటే ఇళ్లు బాగు చేసుకునే వాళ్లం. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపించండి.

– పఠాన్ వహీదాబేగం, ఎన్టీఆర్‌నగర్, సత్తుపల్లి

శిథిలావస్థ ఇళ్లకు నోటీసులిచ్చాం



ఎన్టీఆర్‌లోని నలుగురు, జవహర్‌నగర్‌లో ఇద్దరికి మున్సిపల్ చట్టం ప్రకారం శిథిలమైన ఇళ్లకు నోటీసులిచ్చాం. వర్షాకాలం సందర్భంగా జాగ్రత్తగా ఉండాలని సూచించాం. ఇళ్లు పడిపోయే దశలో ఉంటే తాత్కాలికంగా బయట నివాసం ఉండాలని కోరాం. ఇదంతా ప్రభుత్వ ప్రక్రియలో భాగంగానే చేస్తున్నాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

జాబ్‌మేళా అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్: నిరుద్యోగ యువతకు హెటిరో సంస్థలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజ్యసభ సభ్యులు, హెటిరో సంస్థల అధినేత డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. మండలంలోని గంగారం గ్రామంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన జాబ్ మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సాయినాథుని వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. జాబ్ మేళాలకు 482 మంది నిరుద్యోగులు హాజరు కాగా 175 మంది ఉద్యోగ అర్హత సాధించినట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీఅండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ వి.శేషారత్నకుమారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, ఆత్మచైర్మన్ వనమా వాసు, దాసరి ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఎస్‌కె.రఫీ, వార్డు కౌన్సిలర్లు అద్దంకి అనిల్, గుండ్ర రాఘవేందర్, మేకల నర్సింహారావు, పర్వతనేని వేణు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం



కల్లూరు: యూత్ జోడో-బూత్ జోడో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంభాని

కల్లూరు: దేశ సమగ్రత, సమైక్యత కోసం రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర చారిత్రాత్మకమైందని, కాంగ్రెస్ హయాంలో సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మండలకేంద్రంలో పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొదమసింహం వంశీ అధ్యక్షతన ఆదివారం యూత్ జోడో-బూత్ జోడో కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ అధికారంలోకి వస్తే అందించే పథకాలను ప్రతీ బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, ఎస్సీ డీపీటీ కన్వీనర్ కిండూరు కిరణ్‌కుమార్, కీసర శ్రీనివాసరెడ్డి, కాటేపల్లి కిరణ్‌కుమార్, జక్కేళ్ల కృష్ణారెడ్డి, తోట జనార్దన్, జొన్నలగడ్డ గోపాలస్వామి, ఉస్మాన్, తురాబల్లి, నరేంద్ర, అఫ్రోజ్ పాల్గొన్నారు.

పరామర్శ..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ దూదిపాల రాంబాబు తండ్రి సర్వయ్య ఇటీవల మృతి చెందగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సర్వయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ పట్టణ, మండలాధ్యక్షుడు కొర్రపాటి సాల్మన్‌రాజు, శివవేణు, కాలం కృష్ణ, కిరణ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను దూషించడం తగదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లి: అన్ని వర్గాలను గౌరవించే సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను పొంగులేటి శ్రీనివాసరెడ్డి దొర అంటే ప్రజలు క్షమించరని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా దూషిస్తే ప్రజాక్షేత్రంలో బుద్ధి చెపుతారన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముందు తన పార్టీలో నలుగురు అభ్యర్థులు, నాలుగు క్యాంప్ ఆఫీసులు ఉన్నాయని తమ అభ్యర్థి ఎవరో చెప్పాలన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు వర్గాలతో పార్టీలో గ్రూపులు వచ్చాయని, ఆయన చరిత్ర ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. పదవి లేకపోయినా దొర లాగానే ప్రవర్తిస్తున్నారని, ఇప్పటికైనా చరిత్ర తెసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె రఫీ, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, అద్దంకి అనిల్, వేముపల్లి మధు, ఎస్‌కె అబ్దుల్లా, మేకల నర్సింహారావు, ఎస్‌కె మధార్, కంటే అప్పారావు, గుండ్ర రాఘవేంద్ర పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో రాందాస్‌నాయక్

కారేపల్లి: మండలంలోని గుట్టకిందిగుంపులో ఆదివారం టీపీసీసీ సభ్యులు మాళోత్‌రాందాస్ నాయక్ గడపగడపకు కాంగ్రెస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఉందం ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన 50 కుటుంబాల వారు పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి రాందాస్ నాయక్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ హామీలు ఇవ్వడమే తప్పా, వాటి అమలు చేయడంలో వైఫల్యం చెందుతున్నారన్నారు. రైతులుకు ఇచ్చిన ఋణమాఫీ అమలు చేయలేదని, రైతుబంధు మధ్యలోనే నిలిపివేసిందన్నారు. అమలు చేస్తున్న వాటికే నిధులు లేక నిరసించిపోతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త పథకాల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరాలాల్, నాయకులు మేదరి వీరప్రతాప్ (టోనీ), గుగులోత్ భీముడు, బానోత్ రాంచందర్ పాల్గొన్నారు.

గోకినేపల్లిలో బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

ముదిగొండ: మండలపరిధిలోని గోకినేపల్లిలో యాదవులు బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో మహిళలు బోనాలతో ప్రదర్శనగా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా ఫౌండ్రీ ఫాం జిల్లా అధ్యక్షుడు మీగడ శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ మీగడ నీరజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్ల అభివృద్ధి ఎక్కడ?

మధిర: మధిర పట్టణంలో రూ.100 కోట్ల అభివృద్ధి ఎక్కడ అని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గరిడేపల్లి వేణు ప్రశ్నించారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తున్న అంబేడ్కర్ సెంటర్ ప్రాంతాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని, తనే అభివృద్ధి చేశానని జెడ్పీచైర్మన్ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

తాగునీటి కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

కొణిజర్ల: వారం రోజులుగా తాగునీరు విడుదల చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే తాగునీరు విడుదల చేయాలని కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం రాష్ట్రీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామారావు మాట్లాడుతూ.. మిషన్‌భగీరథ పైప్‌లైన్ కొణిజర్ల నుంచి సుమారు 16 గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తున్నా గేట్ వాల్వ్ మరమ్మతులు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నాణ్యమైన వస్తువులు వినియోగించక పోవడంతో ప్రతీ పదిరోజులకు ఒకసారి గేట్ వాల్వ్‌లు పాడవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్, నాయకులు గుర్రం రమేష్, రాయల అనంతరామయ్య, వార్డు సభ్యులు పెరిక రోశయ్య, చెరుకుమల్లి తిరుమలరావు, కోపెల భాస్కర్, దొడ్డ శ్రీనివాసరావు, నున్నా వెంకటేశ్వర్లు, కుప్పాల శ్రీను, నాగ, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఏన్కూరు: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ సభ్యులు



వైరా: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



కారేపల్లి: ఎర్రబోడులో..

మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పలు పార్టీలు, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ర్యాలీలు నిర్వహించి నల్లబ్యాడ్జీలు ధరించి, కళ్లగంతలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుత రోజుల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొణిజర్ల: ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎన్డీ కార్యకర్తలు

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

బోనకల్: బీఆర్ఎస్ అమలుచేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ యువజన విభాగం ఆత్మీయ సమ్మేళన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఖమ్మం జిల్లా అభివృద్ధిలో మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం మండల యువజన విభాగ కార్యదర్శిగా గుడిదే శ్రీరామ్ గౌడ్, ప్రచార కార్యదర్శిగా రామడుగు నరేష్, సంయుక్త కార్యదర్శిగా షేక్ యూసఫ్, ఉపాధ్యక్షుడిగా నిమ్మతోట రవిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కూన నరేందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు షేక్ నజీర్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మూడవత్ సైదా పాల్గొన్నారు.

'పోడు' భూములకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పెనుబల్లి: ఎన్నో ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరులందరికి పోడు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని పార్థసారథిపురంలో పోడు సాగుదారులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంఘం ఆధ్వర్యంలో చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కొంత మంది పోడు దారులకు 20 కుంటలకి, ఎకరం భూమికి మాత్రమే పోడు పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు, నాయకులు చిమట విశ్వనాథం, కువ్వారపు లక్ష్మణరావు, కుంజా రాములు, పద్దం వెంకటేశ్వరరావు, భిక్షం, సున్నం నాగేశ్వరరావు, రమాదేవి, పోతమ్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బాధితులకు అండగా ఉంటాం..

సత్తుపల్లిటౌన్: సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్‌లతో ఇళ్లు దెబ్బతిన్న బాధితుల పక్షాన పోరాడేందుకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఆదివారం ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు తీసుకున్న బాధితుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. పునరావాసం కల్పించకుండా ఖాళీ చేయాలని చెప్పటం సమంజసం కాదన్నారు. అనంతరం కాలనీలోని ఆర్టీసీ కాలనీరోడ్‌లో పర్యటించి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో యూనియన్లతో సమావేశం నిర్వహించి పార్టీ మేనిఫెస్టో పోస్టర్లను అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, ఎస్‌సీ రాష్ట్ర అధ్యక్షులు అలవాల కరుణాకర్, ఎండి.కమల్‌పాషా, నరుకుళ్ల అప్పారావు, వంగరి రాకేష్, రెహమాన్, భూషణం, సందీప్‌గౌడ్, భరత్, శివ, ఆనంద్, గణేష్, రమణ, యూనిస్, చెన్నారావు, వీరబాబు, సురేష్ పాల్గొన్నారు.

బీఎస్ రావుకు నివాళి



నివాళులర్పిస్తున్న సిబ్బంది

మధిర: ఇటీవల మృతి చెందిన శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావుకు ఆదివారం మధిర పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పించారు. స్థానిక శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ ఆకెళ్ల భారతి ఆధ్వర్యంలో బీఎస్ రావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ కృష్ణారావు, వెంకట్, డీన్.నరేష్, ఇన్‌చార్జ్ కె.తిరుపతిరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను నిలబెట్టారు..

సాక్షి ఎఫెక్ట్..



స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

సత్తుపల్లిరూరల్: మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బేతుపల్లి పెద్ద చెరువు ఆయకట్టు, తాళ్లమడ-రామానగరం రహదారి పక్కన ఉన్న వరిపొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారటంతో విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం వాటిని సరిచేసి నిలబెట్టారు. 'సాక్షి'లో ఆదివారం 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ డీఈఈ రాములు రూరల్ ఏఈ సుజాత, సిబ్బందితో ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరి చేయించారు.